ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025 5 అనంతపురం

ఎన్నిక అనంతరం నరసింహరాజుకు ఛైర్మన్ నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రాజు, ఎన్నికల అధికారి ఆనంద్‌కుమార్



8.70 లక్షల ఎకరాలు బీడు

◆ 10 శాతమే పడ్డ విత్తనం

◆ అందులోనూ వాడుతున్న పంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు మే నెల ఆఖరులో ఊరించిన వర్షం తరువాత మాయం అయ్యింది. జూన్ నుంచి ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితులే అనంతపురం జిల్లాలో కొనసాగుతున్నాయి. దీంతో ఈ ఏడాది పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. 8.70 లక్షల ఎకరాల్లో ఇంకా విత్తనం కూడా పడలేదు. రైతులు పదును కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. జులై రెండవ వారమైనా వానల్లేకపోవడంతో తీవ్రమైన నిరాశలో రైతాంగం ఉన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాత్రం ఆగస్టు వరకు ఖరీఫ్ సాగుకు అనుకూలమని చెబుతున్నా రైతులు మాత్రం జులై రెండవ వారం తరువాత పంటలపై ఆశలు వదులుకునే పరిస్థితులే ఉంటాయి. ఎందుకంటే రైతులు ప్రధానంగా కార్తుల ఆధారంగా విత్తనం విత్తుకుంటారు. సరైన కార్తులు దాటితే పంట వేసినా పెద్దగా ప్రయోజనం ఉండదన్న భావనలో ఉంటారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

10 శాతమే సాగు

అనంతపురం జిల్లాలో 9.68 లక్ష ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు చూస్తే జిల్లాలో సాగైంది కేవలం 98,171 ఎకరాల్లో మాత్రమే ఉంది. ఇందులో ప్రధాన పంటల వారీగా చూస్తే సాగునీటి వసతి కింద సాగయ్యే వరి, మొక్కజొన్న పంటలే ఎక్కువగా ఉండటం గమనార్హం. వరి జిల్లాలో సాధారణ సాగు 54,362 ఎకరాలయితే 43,205 ఎకరాల్లో వరి సాగైంది. మొక్కజొన్న 40 వేల ఎకరాల్లో అయితే విత్తనం పడింది 26 వేల ఎకరాల్లో ఉంది. తక్కిన అన్ని పంటల సాగు మరీ తక్కువగా ఉంది. వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యే వేరుశనగ పంట సాధారణ సాగు విస్తీర్ణం 4.88 లక్షల ఎకరాలవుతే.. విత్తనం పడింది కేవలం 12,429 ఎకరాల్లో మాత్రమే. ఇక పత్తి పంట సాధారణ 1.20 లక్షల ఎకరాలకుగానూ సాగైంది 11,445 ఎకరాలు. కంది పంట 1.84 లక్షల ఎకరాల సాధారణ సాగుకుగానూ 956 ఎకరాల్లో విత్తనం పడింది. 42 వేల ఎకరాలు సాధారణ సాగు ఆముదం పంట అయితే విత్తనం వేసింది 741 ఎకరాల్లో. ఇతర పంటల సాగుకు కూడా అతి తక్కువగా ఉంది. మొత్తంగా ఇప్పటి వరకు ఇంక విత్తనం పడకుండా బీడుగా జిల్లాలో 8.70 లక్షల ఎకరాలు ఉంది.

38.2 శాతం వర్షపాతం లోటు

అనంతపురం జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే 38.2 శాతం వర్షపాతం లోటుంది. 31 మండలాలుంటే కణేకల్, శెట్టూరు మండలాలు మినహా తక్కిన 29 మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులే నెలకుని ఉన్నాయి. కణేకల్‌లో సాధారణ వర్షపాతం 79.1 మిల్లీమీటర్లకుగానూ 139 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆ తరువాత శెట్టూరులో 70.1 మిల్లీమీటర్లకుగానూ 84.4 మిల్లీమీటర్లు పడింది. ఈ రెండు మినహా తక్కిన అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకుని ఉన్నాయి. ఇందులో తొమ్మిది మండలాల్లో వర్షాభావం అంటే 50 శాతం కంటే లోటు ఉండగా, 11 మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ లోటు వర్షపాతముంది. ఈ మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ లోటు వర్షపాతం నెలకొంది. ఎక్కువ లోటు వర్షపాతమున్న మండలాలు చూస్తే గుంతకల్లు, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పామిడి, కూడేరు, పుట్లూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలున్నాయి. ఈ వారంలో వర్షం కురవకపోతే పంట సాగుపై ఆశలు వదులుకునే పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

మడకశిర నగర పంచాయతీ టిడిపి కైవసం

ఛైర్మన్‌గా నరసింహరాజు ఎన్నిక

ప్రజాశక్తి మడకశిర టౌన్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నగరపాలక పంచాయతీని తెలుగుదేశంపార్టీ కైవసం చేసుకుంది. వైసీపీ ఆధ్వర్యంలో ఉన్న ఛైర్మన్ స్థానాన్ని టిడిపి దక్కించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం మడకశిర మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో లక్ష్మీనరసమ్మ ఛైర్మన్ పదవి నుంచి దిగిపోయారు. ఖాళీగా ఉన్న ఛైర్మన్ స్థానానికి బుధవారం నాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఆనందకుమార్ ఎన్నికను నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ ఎన్నికకు ప్రతేక సమావేశం నిర్వహించరు. ఇందులో భాగంగా టీడీపీకి అనుకూలగా 14 మంది కౌన్సిర్లు, ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటుతో కలిసి 15 మంది మద్దతు లభించింది. ఛైర్మన్ ఎన్నికకు కావాల్సిన పూర్తి మెజార్టీ ఉండడంతో మున్సిపల్ ఛైర్మన్‌గా నరసింహరాజు, వైస్ ఛైర్మన్‌గా ప్రభావతిలు ఎన్నికయ్యారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు నియామక పత్రాలను ఎన్నికల అధికారి అందించారు. ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను అభినందించారు.

రామగిరి ఎంపిపి ఎన్నిక మళ్లీ వాయిదా

అనంతపురం : శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపిపి ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన అధ్యక్షురాలి ఎన్నిక మరోసారి కూడా అలానే పునరావృతం అయ్యింది. ఎన్నికకు సంబంధించి కోరం లేని కారణంగా అధికారులు ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రామగిరి ఎంపిపిగా పని చేస్తున్న మీనగ నాగమ్మ అనారోగ్య సమస్యలతో గతేడాది డిసెంబర్‌లో మరణించారు. దీంతో అక్కడ ఎంపిపి ఎన్నిక అనివార్యం అయ్యింది. ఇక్కడ వైసిపికి మెజార్టీ ఎంపిటిసిలు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇద్దరు వైసిపి ఎంపిటిసిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మరణించిన ఎంపిపి స్థానం కాకుండా 9 ఎంపిటిసి స్థానాల్లో మూడు టిడిపి, ఆరు వైసిపికి బలం ఉంది. ముందునుంచి వైసిపి తాము ఎంపిపి ఎన్నికలో పాల్గొనబోమని చెబుతోంది. ఆ విధంగానే గత రెండు సార్లు జరిగిన ఎన్నికలో వైసిపి పాల్గొనలేదు. మూడవ సారి బుధవారం నాటి ఎన్నికకు కూడా ఆ పార్టీ ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. మెజార్టీ ఎంపిటిసిలు గైర్హాజరు కావడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఎంపిపి ఎన్నిక సమస్యాత్మకం అయిన నేపథ్యంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం నెలకొనకుండా పోలీసులు ముందస్తు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పి-4 లక్ష్యాలను చేరుకుందాం : కలెక్టర్

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పి-4 కార్యక్రమంలో కేటాయించిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జీరో పావర్టీ పి4పై ఆయా శాఖల జిల్లా, మండల, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ ప్లానింగ్ శాఖ సమగ్ర టీం అధికారి సాయి సాత్విక్ పి4 కార్యక్రమం, మార్గదర్శకుల రిజిస్ట్రేషన్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పి4 కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా 68,381 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వీరిలో ఇప్పటివరకు 18,396 మందిని దత్తత ఇచ్చినట్లు చెప్పారు. మిగిలిన 49,985 మంది బంగారు కుటుంబాలను దత్తత ఇచ్చేలా అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. దత్తత తీసుకునే మార్గదర్శకులను గుర్తించాలని తెలియజేశారు. తాడిపత్రి రూరల్, యల్లనూరు, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, విడపనకల్లు తదితర కొన్ని మండలాలు మార్గదర్శకుల గుర్తింపులో వెనుకబాటు ఉందని, అక్కడి అధికారులు దీనిపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఒ ఆశోక్ కుమార్, ఆర్డీవో కేశవనాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, రామ్మోహన్, మల్లికార్జునుడు, డిపిఒ నాగరాజునాయుడు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలను నియంత్రించాలి : డిఎంహెచ్ఒ

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఎక్కడా మాతా, శిశు మరణాలు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిఎంహెచ్ఒ ఈబి.దేవి ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా జూన్ నెలలో జరిగిన మాతా, శిశు మరణాలకు గల కారణాలపై బుధవారం డిఎంహెచ్ఒ ఆ ప్రాంత వైద్యులు, సిబ్బందితో సమీక్ష, సమావేశం నిర్వహించారు. మాతా, శిశు మరణాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భిణులు, పురిటిపిల్లలకు నాటు వైద్యం, తంత్ర వైద్యం చేయడం మంచిది కాదని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు డెలివరీ తరువాత కూడా 6 నెలలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో మాతా, శిశు మరణాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్నారు. హై రిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక జాగ్రతలు తీసుకొంటూ సుఖప్రసవం జరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ రవికుమార్ మాట్లాడుతూ శిశు మరణాలను నియంత్రించేందుకు అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. మాల్ న్యూట్రిషన్ వల్ల ఏ శిశువు మరణించకూడదన్నారు. ప్రతి శిశువుకు గంటలోపు తల్లిపాలు తాగించాలన్నారు. బుడ్డి పాలు మంచిది కాదన్నారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, డాక్టర్ మధుసూ దన్, మత్తు మందు నిపుణులు డాక్టర్ ప్రణీత్, చిన్నపిల్లల నిపుణులు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, స్త్రీ వైద్య నిపుణులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాణిఎస్తేర్, ప్రమీలాదేవి, పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని పరిరక్షించుకోవాలి : ఎమ్మెల్యే

చేనేత మిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

చేనేత రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, ప్రభుత్వం కూడా చేనేత రంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జెసి.దివాకర్‌రెడ్డి కల్యాణ మండపంలో బుధవారం చేనేత క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత రంగాన్ని పరిరక్షించడంలో భాగంగా అర్హులైన కార్మికులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు. ప్రతి కార్మికుడు ఉద్పాదకతను పెంచుకోవాలని సూచించారు. రోజూ మగ్గం నేయడం నేతన్నకు ఎంతో భారంగా మారుతున్నందున ప్రస్తుతం త్రీవీల్ మిషన్లను ప్రభుత్వం 90శాతం రాయితీతో అందజేస్తుంద న్నారు. ఈ మిషన్ ఎంతో సౌకర్యంగా ఉంటుందని కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పెద్దవడుగూరుతో పాటు క్రిష్టిపాడు. చిన్నవడుగూరు, ముప్పాలగుత్తి, విరుపాపురం, ఆవులంపల్లి, కొత్త పల్లి గ్రామాలకు చెందిన 365 మందికి నేత మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో చేనేత, జౌళిశాఖల ఈడి వరప్రసాద్, తహాశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఒ బరాన్‌సాహెబ్, ఉపాధి ఎపిడి పుల్లారెడ్డి, పిఆర్ ఇంజినీర్ లక్ష్మీదేవి, చేనేత శాఖ సాంకేతిక సహాయకులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-యల్లనూరు

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఎంపిడిఒ కరుణసాగర్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులకు సంబంధించిన అన్ని రికార్డులు సరి చూసుకోవాలన్నారు. పండ్ల మొక్కలు నాటుకున్న రైతులకు వేతనాలు చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఓబిరెడ్డి, ఈసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్‌లు చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం నాయుడు, సిఒలు గిరి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

18న శకుని పౌరాణిక నాటకం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం లలిత కళా పరిషత్‌లో ఈనెల 18వ తేదీ సాయంత్రం 5-30గంటలకు శకుని పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ పి.గురు ప్రసాద్, సెక్రెటరీ జి.పద్మజ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, సురేంద్రబాబు, పరిటాల సునీత, అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ హాజరవుతారన్నారు. నంది నాటకోత్సవాల్లో పాల్గొన్నబోతున్న గొప్ప పౌరాణిక నాటకమని, నగర ప్రజలందరూ విచ్చేసి దీనిని తిలకించాలని కోరారు.

ఆఫ్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లు జరపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఆఫ్‌లైన్ విధానంలో అడ్మిషన్లు నిర్వహించాలని, డబుల్ మేజర్ విధానం కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణం లోని సమైక్యాంధ్ర భవన్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు వలి మాట్లాడుతూ మొదట్లో డబుల్ మేజర్ విధానాన్ని అవలంబిస్తామని ప్రకటించి, అనంతరం సింగల్ మేజర్ విధానాన్ని పాటిస్తున్నట్లు చెప్పడంతో డిగ్రీ అడ్మిషన్ల విధానంపై విద్యార్థుల్లో గందరగోళం నెలకొందన్నారు. వెంటనే మొదటి సంవత్సరం అడ్మిషన్లు చేపట్టాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని, విద్యార్థులకు యాజమాన్యం నుండి స్టైఫండ్ వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు అనిల్, గణేష్, చరణ్, శివారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దళితునిపై దాడి హేయం

పెత్తందారులను అరెస్టు చేయాలి - కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కుందుర్పి మండలం మాకొడికి గ్రామంలో పీర్ల పండగ సందర్భంగా గుడిమెట్ల ఎక్కారనే నెపంతో గ్రామానికి చెందిన దళిత గంగాధర్‌పై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడదల చేశారు. మాకొడికి గ్రామంలో మూడు సంవత్సరాల క్రితం పాత పీర్ల మకానం స్థానంలో కొత్త పీర్ల మకానం కట్టించారన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఆలయ ప్రవేశం కోసం దళితులు ప్రయత్నం చేస్తూనే ఉన్నారని చెప్పారు. అయినా దళితకు అందులోకి ప్రవేశం కల్పించలేదన్నారు. దీనిపై ఏ ఒక్క అధికారి కూడా స్పందించలేదన్నారు. ఈ ఏడాది ఆలయ ప్రవేశం చేయడంతో పెత్తందారులు సహించలేక దళితుల మీద దాడులకు పాల్పడ్డారన్నారు. ఆ గ్రామంలో ఇప్పటికీ కటింగ్ షాపుల్లో కటింగ్ చేయడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా ఇంకా దళితులపై వివక్ష ఉండడం సిగ్గుచేటన్నారు. కులాలు, మతాలకతీతంగా మతసామరస్యం కోసం జరుపుకునే పీర్ల పండుగలో దళితులను దళితులపై దాడి చేయడం అన్యాయమన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, వెంటనే దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని కలెక్టర్, ఎస్పీ సందర్శించాలన్నారు. దళితులకు జరుగుతున్న వివక్ష, అంటరానితనంపై స్పందించి ఆలయ ప్రవేశాలు కల్పించాలని కోరారు. లేని పక్షంలో కెవిపిఎస్ ఇతర దళిత, గిరిజన సంఘాలను కలుపుకుని ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు, రైతులు

'మా గ్రామాల్లో డంపింగ్ యార్డ్ వద్దు'

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని డంపింగ్ యార్డ్‌ను తమ గ్రామాల సమీపంలోకి మార్చొద్దని రైతులు, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ మాకొద్దు అంటూ నరసనాయునికుంట, నారాయణపురం, నాగిరెడ్డిపల్లి, కొడిమి గ్రామాల రైతులు బుధవారం నాడు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని గేటు వద్ద బైటాయించి నినాదాలు చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే తమ భూములు నిస్సారం అయ్యి ఎందుకూ పనికి రాకుండా పోతాయన్నారు. స్థానికంగా ఉన్న ప్రజలూ అనారోగ్యం పాలుకావాల్సి వస్తుందన్నారు. తమ అనుమతి లేకుండా డంపింగ్‌యార్డును ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆందోళన అనంతరం రైతులు, గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటరాముడు, గంగాధర్, అనిల్, రవి, అంజి, రమణ, చంద్రశేఖర్‌రెడ్డి, రాయుడు పాల్గొన్నారు.

నేడు హంద్రీనీవాకు కృష్ణా జలాలు విడుదల
ప్రభుత్వ విప్ కాలవశ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా హంద్రీనీవీ జలాలను మల్యాల వద్ద గురువారం విడుదల చేయనున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో హంద్రీనీవాకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. 2019-2024 మధ్యలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పూర్తి నిర్లక్ష్యానికి, నయవంచనకు గురైన పథకాల్లో హంద్రీనీవా ఒకటి అన్నారు. కూటమి ఏడాదిలో రూ.3 వేల కోట్లు పైచిలుకు నిధులతో కాలువ వెడల్పు, రెండవ దశ పనులకు ఖర్చు చేసినట్లు చెప్పారు. గురువారం నాడు ముఖ్యమంత్రి స్వయంగా నీటిని విడుదల చేస్తుండడం ఉమ్మడి అనంతకు ఎంతో మేలు చేయనుందన్నారు.

లక్ష్యాన్ని ఛేదించేలా శిక్షణ : ఎస్పీ

ఫైరింగ్‌లో పాల్గొన్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఇటుకలపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మన్నీల శివారులో ఉన్న జిల్లా పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో పోలీస్ అధికారులకు నిర్వహించిన ఫైరింగ్ సాధన ప్రక్రియను ఎస్పీ పి.జగదీష్ బుధవారం పరిశీలించారు. ఫైరింగ్ ప్రక్రియపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని ఫైరింగ్ ప్రాక్టీస్ చేశ్వారు. ఫైరింగ్‌లో ప్రతి అధికారి పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్క బుల్లెట్ టార్గెట్‌బుల్స్ పడే విధంగా తర్ఫీదు పొందాలన్నారు. కొత్తగా వచ్చిన ఆయుధాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకుని, అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన,ప్రాణాలు, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జిల్లా పోలీసు శాఖఉన్నతి కోసం ముందడుగు వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషాతో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఫ్యాన్లు, విద్యుత్ బల్బుల వితరణ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు మీనాక్షమ్మ ఫౌండేషన్ అధినేత రవికాంత్ రమణ ఆధ్వర్యంలో 20 ఫ్యాన్లు, 20 విద్యుత్ దీపాలను అందజేశారు. నాలుగు రోజుల్లోపు పాఠశాలకు నీటి శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని రవికాంత్ రమణ సూచించారు. గురుకుల పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ఆయనకు పాఠశాల ప్రిన్సిపల్ అర్జున్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగానికి ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

వర్చస కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో అనంతపురం ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల 2022-2025 బ్యాచ్‌కు చెందిన బీఎస్సీఎం ఇసిస్ విద్యార్థి ఎస్.చైతన్య బాబు ఎంపిక అయ్యాడు. కేపీవో అనలిస్ట్‌గా విద్యార్థికి ఉద్యోగం లభించింది. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సవాళ్లను ఎదుర్కొని లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా॥ఎన్‌ఎవి.ప్రసాద్ ఏవో ఎ.శ్రీనాథ్, ప్లేస్మెంట్ అధికారి ఎస్.సాయిరాం పాల్గొన్నారు.

యాడికి ప్రధాన కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి-యాడికి

పెద్దవడుగూరు ప్రధాన కాలువ నుంచి యాడికి బ్రాంచి కెనాల్ వరకూ జరుగుతున్న పూడికతీత, ముళ్లపొదల తొలిగింపు పనులను బుధవారం తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పూడిక తీత పనుల వల్ల పెద్దవడుగూరు కాలువ నుంచి క్రిష్టిపాడు హెడ్ రెగ్యులేటర్, రాయలచెరువు చెరువు, యాడికి మండలంలోని వ్యవసాయ ఆధారిత భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఇందు కోసం ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సుమారు రూ. 20 లక్షల సొంత నిధులతో ఈ పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, నాయకులు వేలూరు రంగయ్య, రవికుమార్‌రెడ్డి, నరసింహచౌదరి, కోడూరు నీలకంఠారెడ్డి, శ్రీహరి ఉన్నారు.

వెలుగు కార్యాలయం చుట్టూ కంచె

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఆవరణం ముళ్ల కంపలతో నిండిపోయిన విషయాన్ని 'అపరిశుభ్రంగా వెలుగు కార్యాలయం' అన్న శీర్షికతో ఈ నెల 8న ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితం అయ్యింది. దీనిపై వెలుగు కార్యాలయ సిబ్బంది స్పందించారు. కార్యాలయంలో కంపచెట్లను తొలగించి, చుట్టూ కంచె వేసి పరిశుభ్రం చేశారు.

చుట్టూ కంచె వేస్తున్న వెలుగు సిబ్బంది

డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు పారిశుధ్య కార్మికుల మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో నిరవధిక సమ్మెలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. వీరికి మద్దతుగా బుధవారం పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ముందుగా మున్సిపల్ కార్మికులు నగరపాలక సంస్థ నుంచి ర్యాలీగా వెళ్లి స్థానిక సప్తగిరి సర్కిల్లో మానవహారం ఏర్పడ్డారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికుల సమ్మె కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. సమ్మెను మరింత ఉధృతం చేయడానికి చలో విజయవాడ చేపడుతున్నామని తెలిపారు. గురువారం మున్సిపల్ డిఎంఎ ఆఫీసును ముట్టడిస్తున్నామని హెచ్చరించారు. అంతకుముందు దీక్షా శిబిరంలో మున్సిపల్ కార్మికులకు మద్దతుగా ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులు దరువు వేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు నాగమణి, రామాంజనేయులు, నగర అధ్యక్షులు వెంకటనారాయణ, ఆటో యూనియన్ నగర కార్యదర్శి ఎర్రిస్వామి, శ్రీనివాసులు, ఆదినారాయణ, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబులపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, పారిశుధ్య కార్మికుల యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు, ఉపాధ్యక్షులు బండారి ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, నారాయణ, మంత్రి వరలక్ష్మి, కోనప్ప, రాఘవ, పెన్నా, శేషు, అయూబ్, ఇమామ్, శివన్న, సుబ్బిరెడ్డి, రవికిరణ్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్లో మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ కార్మికులు

తాడిపత్రి : మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె మరింత ఉధృతం చేస్తామని కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు పట్టణంలోని దీక్షా శిబిరం నుంచి అశోక్ పిల్లర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎపిఎం నాగరాజు, సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి, ఉమాగౌడ్ పాల్గొని మాట్లాడారు. కార్మిక సంఘం సిఐటియు నాయకులు రామాంజనేయులు, రామ్మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీరాములు, జుబేర్‌బాబు, బాషా, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరంలో చెట్ల ఆకులు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వారికి పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. సమస్యలను పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనే యులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా రవిశంకర్, ఉపాధ్యక్షులు ఎస్ఎ.మురళి, రాజకుమార్, సహాయ కార్యదర్శులు నరసింహా, ఆదినారాయణ, కోశాధికారి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో నిరసన ప్రదర్శన చేపట్టిన మున్సిపల్ కార్మికులు


గుత్తిలో నిరసన ప్రదర్శన చేపట్టిన మున్సిపల్ కార్మికులు

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పని చేస్తుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే కంబదూరు మండలంలోని నూతిమడుగు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రాయలసీమ నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి హంద్రీనీవా కాలువ పనుల కోసం రూ. 3,500 కోట్లు వెచ్చించిందని, తద్వారా మరింత ఎక్కువ మొత్తంలో నీటిని తీసుకొచ్చేన్నారు. అనంతరం ఎమ్మెల్యే వర్షభావంతో బాధపడుతున్న వడ్డే రామాంజనేయులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. అంతకుముందు పార్టీ మండల నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట పార్టీ పరిశీలకులు నాగేశ్వరయాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ లక్ష్మీదేవి, రమేష్, రామ్మోహన్‌చౌదరి, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పార్టీ అబ్జర్వర్ నాగేశ్వర్ యాదవ్ పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విన్నపం మేరకు గ్రామంలో త్వరలోనే ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. పాఠశాలలో 5 తరగతులకు 2 గదులే ఉన్నాయని ఉపాధ్యాయులు తెలపగా బయట ఉన్న స్థలంలో షెడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఒకే కుటుంబంలో ఏడుగురు కుమార్తెలు పుట్టారని తండ్రి చనిపోయారని చెప్పగా ఆ కుటుంబానికి తక్షణమే రూ. 10వేలు అందజేసి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని బొమ్మలకుంటపల్లి గ్రామంలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఆమె స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఏడాది పాలనపై ప్రజలను ఆరా తీయగా గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి హామీని నెరవేరుస్తుందన్నారు. ఆమె వెంట ఎంపిపి మమతాదేవి, డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ జనార్ధన్, పిఆర్ ఇంజినీర్ రమణయ్య, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయప్ప, సాగునీటి సంఘం అధ్యక్షులు ఆలం నాగార్జున, మండల కన్వీనర్ ఎర్నాగప్ప ఉన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పామిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం నూతన డిప్యూటీ ఎంపిడిఒగా అశ్వర్థనాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈయన పామిడి ఎగ్జిక్యూటివ్ కార్యదర్శిగా విధులు నిర్వహించేవారు. ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థనాయుడు

కళాశాల తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం. వెంకటరమణనాయక్ సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉరవకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

20న ఇళ్ల స్థలాలకు అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

మాజీ సైనికుల ఇంటి స్థలాలకు సంబంధించి ఈ నెల 20వ తేదీ స్థానిక వికె భవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న తెలిపారు. నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో ఉన్న సంఘం కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని మాజీ మాజీ సైనికులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పట్నం ఉమా మహేశ్వర రావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

20న ఉచిత కంటి వైద్య శిబిరం

పామిడి : పట్టణంలోని శ్రీబావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఈ నెల 20 వ తేదీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘువీర్, జయరామ్‌రావు తెలిపారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి బెంగళూరులో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పామిడి

సిఎం చంద్రబాబు ఎన్నికల హామీల్లో ప్రతి ఒక్కటీ తప్పకుండా నెరవేరుస్తారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యేతో పాటు పామిడి, గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ మండలంలోని సొరకాయల పేట గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 19 ఏళ్లు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500 ఇస్తారన్నారు. ఎమ్మెల్యే వెంట మండల, పట్టణ కూటమి నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.

సొరకాయలపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి అనుమతి లేని రూ. 2.6లక్షల విలువ చేసే ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ నరేంద్ర భూపతి, కర్నూలు వ్యవసాయ సహాయ సంచాలకులు శాలిరెడ్డి తెలిపారు. వారు బుధవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా తిరుమల ఆగ్రో సెంటర్ (ఎరువుల దుకాణం)లో లైసెన్స్‌కు ఫాం ఓ ఇన్స్యూఎషన్ లేని కారణంగా ఆ ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేసినట్లు తెలిపారు. తదుపరి ఫాం ఓను ఏడిఏకు సమర్పించి లైసెన్స్ ఇన్స్యూఎషన్ చేసుకున్నాక విక్రయాలకు అనుమతి ఇస్తామన్నారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, అనుమతి లేని ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి అహ్మద్‌బాషా ఉన్నారు.

ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

'పొగాకు' దుష్ప్రభావాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలోని తపోవనం జడ్పీ హైస్కూల్‌లో పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాల సేకరణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పొగాకు నియంత్రణ కార్యక్రమం సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 21వ తేదీ వరకూ పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించడం, జీవితంలో పొగాకు ఉత్పత్తులు వాడను అని సంతకాలు సేకరించాలన్నారు. సిగరెట్, ఇతర పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. విద్యాసంస్థల పరిధిలో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మకూడదని, అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం అందరి చేత పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-పామిడి

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డిటి)కు తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవ్ ఆర్‌డిటి' వంద గంటల రిలే దీక్షలు 3వ రోజైన బుధవారం కొనసాగాయి. ఐఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంకరాజుకాలువ వెంకటేష్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు విశేష సేవలు అందిస్తున్న ఆర్‌డిటికి విదేశీ నిధులను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఆర్‌డిటి లేకపోతే పేదలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు దూరం అవుతాయన్న విషయాన్ని ప్రభుత్వాలు గ్రహించి వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలన్నారు. వీరికి పాల్యం మురళి, ఎద్దులపల్లి సూర్యనారాయణ మద్దతు పలికారు. దీక్షా శిబిరంలో తపాలా లక్ష్మీ, కొండాపురం శంకర్, రాజ్‌కుమార్, సుధీర్, కేశవ్, శేఖర్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతోనే కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-గుత్తి

కక్షిదారులు రాజీ అయ్యే కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారి సూచించారు. మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో 'దేశం కోసం మధ్యవర్తిత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా న్యాయ మూర్తులు, న్యాయవాదులు కోర్టు ప్రాంగణం నుంచి బయల్దేరి పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ నాయకులు పిడి.రత్నం, చంద్రశేఖర్, న్యాయవాదులు కె.శ్రీనివాసులు, విసి.గంగాధర్ కుమార్, ఆర్‌వి.చలపతి, కె.మనోహర్ బాబు, ఏజిపి ఫక్రుబాషా, జి.విజయ భాస్కర్, ఎన్.ఓబులేసు, సాలప్ప, ఎ.రామ్మోహన్ రెడ్డి, సి.సత్యనారాయణ, జంగం కృష్ణ, పారా లీగల్ వాలంటీర్లు వి.నరసింహారెడ్డి, జి.గీతావరలక్ష్మి, టైపిస్ట్ ఎస్.సాధిక్‌వలి, పాల్గొన్నారు.

ఘనంగా 'వరల్డ్ యూత్ స్కిల్ డే'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శెట్టూరు మండలంలోని ఎపి మోడల్ స్కూల్‌లో బుధవారం వృత్తి విద్య అధ్యాపకులు వినోద్ కుమార్, మహేష్ ఆధ్వర్యంలో 'వరల్డ్ యూత్ స్కిల్ డే' వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఫిరోజ్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు, ఒకేషనల్ డ్రాయింగ్ చార్టులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. వృత్తి విద్య స్కిల్స్‌ను నేర్చుకున్నంటే జీవితంలో ఎంతో ఉపయోగ పడతాయని, ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

'వరల్డ్ యూత్ స్కిల్ డే' మాట్లాడుతున్న అధ్యాపకులు, హాజరైన విద్యార్థులు

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-నార్పల

దాతలు గ్రామ సచివాలయంలో పేరు నమోదు చేసుకుని పేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందించేలా ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ మమతా దేవి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన ఎంపిడిఒ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ మాట్లాడుతూ నార్పల పిహెచ్‌సికి వెంటనే రెగ్యులర్ వైద్యులను నియమించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు వారి శాఖల నివేదికలను తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ అందని రైతులు తన దృష్టికి తీసుకురావాలని విద్యుత్ ఏఈ నీలకంఠ సూచించారు. జులై 30వ తేదీ లోపు వర్షాలు కురవకపోతే రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి చెన్నవీరాస్వామి తెలిపారు. ప్రభుత్వ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులందరికీ చేరేలా చూడాలని ఎంపిపి నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో అన్ని శాఖల మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచి మృతికి రఘువీరా నివాళి

కళ్యాణదుర్గం టౌన్ : కళ్యాణదుర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచి బాలనరేంద్రకుమార్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘు వీరారెడ్డి నరేంద్రకుమార్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కళ్యాణదుర్గం మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచిగా రెండు పర్యాయాలు కొనసాగి ప్రజలకు ఎన్నో సేవలందించారని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కళ్యాణదుర్గం, అనంతపురం, శింగనమల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జులు రామ్‌భూపాల్‌రెడ్డి, దాదా గాంధీ, శంకర్‌తో పాటు నాయకులు బెస్తరపల్లి కృష్ణమూర్తి, సుదర్శన్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లి రామాంజనేయులు, బాబురెడ్డి, దొణస్వామి బాల నరేంద్రకుమార్ మృతికి నివాళులర్పించారు.

బాలనరేంద్రకుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రఘువీరా

నేరాలు ఘోరాలు

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మతి చెందిన సంఘటన బుక్కరాయసముద్రం మండలం 544-డి నేషనల్ హైవేపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పాములాయి క్రాస్ నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న క్రమంలో బోయ కొట్టాల క్రాస్ వద్ద గుర్తు తెలియని ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. మృతుని వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉంటుంది. మృతుని కుడి చేతిపై ఎఎ అనే రెండు ఇంగ్లీషు అక్షరాలు, అల్లు అర్జున్ అనే పచ్చబొట్టు, కుడి చేయి పైన త్రిశూలం పచ్చబొట్టు, ఎడమ చేయి మధ్య వేలిపై ఎస్ అనే పచ్చబొట్టు ఉన్నాయి. ఈ వ్యక్తి ఆచూకి తెలిసిన వారు 9440796816 సెల్‌కు ఫోన్ చేయాలని సిఐ పుల్లయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫంక్షన్ హాలులో చోరీ

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి ఆర్ఎస్‌లోని ఆర్‌కె ఫంక్షన్ హాలులో బుధవారం వేకువ జామున చోరీ జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం దేవరబండ గ్రామానికి చెందిన తిమ్మప్ప, రత్నమ్మ దంపతులు ఫంక్షన్ హాలులో నాలుగేళ్లుగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. బుధవారం ఓ శుభకార్యం ఉండటంతో ఫంక్షన్ హాల్ కిచెన్‌లో స్వీట్లు తయారు చేస్తుండటంతో వారు ఉంటున్న గదికి తాళం వేసి వెళ్లారు. వారు ఫంక్షన్ హాల్‌లోనే నిద్రించారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఫంక్షన్ హాల్‌కు బయట నుంచి తలుపునకు గడియ వేసి తిమ్మప్ప దంపతులు ఉంటున్న గతి తలుపు తాళాలు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా పగులగొట్టి అందులో ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు, రూ. 14 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం నిద్ర లేచిన వారు ఫంక్షన్ హాల్ తలుపులు వేసి ఉండటంతో ఏదో జరిగిందని గ్రహించారు. ఇతరులకు ఫోన్ చేసి తలుపులు తీసుకొని వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండి వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. చోరీని గ్రహించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం డాగ్ స్క్వాడ్ కు సమాచారం ఇచ్చారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రతి మూడు నెలలకు ఓసారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలు, ముందు సమావేశంలో చర్చించిన సమస్యలు ఏమేరకు పరిష్కారమయ్యాయనేది తెలుసుకునే వేదికను తూతూమంత్రంగా ముగించేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి మారుతమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అయితే వివిధ శాఖల అధికారులు వారి నివేదికలను వివరరించడంతోనే సరిపెట్టుకున్నారు. ఏ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమస్యలపై నోరుమెదపకపోవడం గమనార్హం. అధికారులు సైతం కాసేపు సమావేశంలో కూర్చోవడం, బయటకు వెళ్లడం, తిరిగి లోపలికి రావడం లాంటి పరిస్థితి కనిపించింది. ఎంపిటిసిలకు మూడు నెలలుగా గౌరవ వేతనాలు రాలేదంటూ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

మాట్లాడుతున్న ఎంపిపి మారుతమ్మ

చేనేత హస్తకళల ప్రదర్శనకు విశేష స్పందన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని అశోక్ నగర్‌లో ఉన్న అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన కళా శిల్క్ చేనేత హస్తకళల ప్రదర్శనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తుందని నిర్వాహకులు సంజయ్ జయం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళా సిల్క్ సంస్థ జిల్లాలో మూడు దశాబ్దాలుగా నమ్మకమైన వ్యాపారం అందిస్తున్నట్లు చెప్పారు. చేనేతలు, హస్త కళాకారులు రూపొందించిన వేల రకాల చీరలు, వస్తువులను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. దేశంలోనే ప్రముఖ సంస్థగా కళా సిల్క్ సంస్థ నిలిచిందన్నారు. ప్రజలకు నమ్మకమైన ధరల్లో నాణ్యమైన వస్త్రాలు, పట్టు చీరలు, చీరలు, ఫ్యాన్సీ చీరలు, డిజైనర్ చీరలు, పోచంపల్లి డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్, షూటింగ్స్, షర్టింగ్స్, జువెలరీ, బెడ్ షీట్స్ లభిస్తున్నట్లు చెప్పారు. ఎపితో పాటు అస్సాం, బీహార్, చత్తీస్‌ఘడ్, గుజరాత్, జమ్మూకాశ్మీర్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌పలు రాష్ట్రాలకు చెందిన వేల రకాల మోడల్స్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. దాదాపు 65 శాతం మేర డిస్కౌంట్‌తో అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశం కొద్దిరోజులు మాత్రమే ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హస్తకళా ప్రదర్శనలో చీరలను పరిశీలిస్తున్న మహిళలు

పారిశుధ్య పనుల పరిశీలన

రాయదుర్గం రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని ఆవులదట్ల, 74-ఉడేగోళం గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్త సేకరణ, పారిశుధ్య పనుల తీరును పర్యవేక్షించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మి తయారీని పరిశీలించారు. ఆవులదట్ల బీసీ కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారా అని ఆరా తీశారు. రోడ్డుకు ఇరువైపులా దిబ్బలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, ఎంపిడిఒ కొండన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం, కల్తీకల్లు విక్రయాలపై నిఘా

గుత్తి : ఉమ్మడి అనంతపురం జిల్లాలో నకిలీ మద్యం బాటిళ్లు, కల్తీకల్లు విక్రయాలు జరగకుండా నిఘా ఉంచామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉపకమిషనర్ పి.నాగమద్దయ్య తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలోని ఏ-వన్ బార్ అండ్ రెస్టారెంట్‌ను తనిఖీ చేశారు. రసాయనిక పరీక్షల నిమిత్తం మద్యం నమూనాలను సేకరించారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారవ్వకుండా నిరంతరం దాడులు నిర్వహించా లని అధికారులను ఆదేశించారు. సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.శ్రీరామ్, ఎస్ఐ అస్లాంబేగ్ ఉన్నారు.

రైతులకు రశీదు ఇవ్వాలి

నార్పల : ఎరువులు, విత్తనాలు తీసుకున్న ప్రతి రైతుకూ రశీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి చెన్న వీరాస్వామి ఆదేశించారు. స్థానిక రైతు సేవా కేంద్రం-1లో బుధవారం మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తన దుకాణదారులతో ఏవో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఏడిఎ రవి పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ డీలర్లు చట్టానికి లోబడి వ్యాపారం చేయలన్నారు. ఎమ్మార్పీకే మందులు, ఎరువులు విక్రయించాలన్నారు. స్టాక్ వివరాలు, ధరల పట్టిక కచ్చితంగా అప్డేట్ చేయలన్నారు. రైతుల నుంచి ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఏఇఓ ప్రసాద్, గ్రామ వ్యవసాయ అధికారి నరేష్, డీలర్లు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలు ఏకరువు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి పద్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు వివిధ సమస్యలు ఏకరువు పెట్టారు. ఎంపిటిసి సభ్యులు తిమ్మప్ప మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రతి ఇంటికీ నెలకు రూ. 500 నుంచి రూ. 1000 వరకూ విద్యుత్ బిల్లు వస్తుండడంతో వినియోగదారులు లబోదిబోమంటు న్నారన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభానికి నోచుకోలేదన్నారు. మండల అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య నెలకొందని, గృహాలకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. మండలంలో 11 వేల మంది విద్యార్థులు ఉండగా 800 మందికి తల్లికి వందనం నిధులు ఖాతాల్లో జమ కాలేదన్నారు. జాయింట్ ఎల్‌పి సమస్య వల్ల పలువురు రైతులు బ్యాంకులో రుణాలు రెన్యూవల్ చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఉచితంగా సర్వే చేయాలని జాయింట్ ఎల్‌పి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. సోలార్ ప్లాంట్లకు భూములు ఇవ్వాలని రైతులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని తెలుపగా కొత్త డీఎస్సీ ద్వారా వచ్చే ఉపాధ్యాయులను నియమిస్తామని ఎంఇఒ మల్లికార్జున వివరించారు. ఉపాధి హామీ కూలీలకు బిల్లులు, పండ్లతోటల పెంపకంలో భాగంగా నీళ్లు పోసిన బిల్లులు, కాపలా బిల్లులు, కంచె వేసిన బిల్లులు ఏవీ అందలేదన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. మండలంలో అంగన్వాడీ కేంద్రాలు 67 ఉండగా 20 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని మిగిలిన సెంటర్లు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపిడిఒ విజయభాస్కర్, తహశీల్దార్ మునివేలు, ఈవోఆర్‌డీ దాస్, ఐకెపి ఎపిఒ రామకష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ విజయభాస్కర్

IN THE COURT OF JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION), TADIPATRI
O.S.No.329/2024

Between:
Maniyar Masood Vali ...Plaintiff
V/s
Mattar Bi Gari Hussain Bi @ Hussain Bhanu Died by LR'S S.Mahammed Vali & Others
...Defendants

ప్రతివాదులకు బహిరంగ నోటీసు
(3,4,5 మరియు 7 ప్రతివాదులు)

1.Sattar Bi Fathima Bhanu, W/o.S.Rehaman (D3)
2.Sattar Bi Shanaz W/o. S. Abdul Munaf (D4)
3.Sattar Bi Jabina, W/o.S.Khaled Basha (D5)
4.Hakkem Shahida, W/o.A.Shahid (D7) All are R/o.D.No.9/2, 9th Ward, Ogetivari Street, Tadipatri Town, Ananthapur District.

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పై దావా నందు వాది చూపుదాయకపు దస్తావేజు మొత్తం రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేసియుంటూ ఉన్నాడు. సదరు దావా ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం వాయిదాకు ఉంటు ఉన్నాది. అందువలన మీకు తెలుపడం ఏమనగా తేదీ.21-08-2025వ తేదీన ఉ॥10.30 గం॥లకు పై కోర్టు యెదుట హాజరై పై దావాకు సంబంధించి ఏమైనా అభ్యంతరములు ఉన్నచో స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గాని హాజరై తెలుపుకొనవచ్చు లేనంతట మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని ఖచ్చితంగా తెలుపడమైది. (కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

అప్పా క్రిష్ణయ్య, M.A.,LLB
అంబటి రాజేశ్వరి, M.A.,ML
వాది పరం న్యాయవాదులు, తాడిపత్రి-575416,
సెల్: 9441039819